www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 29 | జూన్ | 2025
పేజీలు : 8

## రష్మితకు ల్యాప్‌టాప్ బహూకరించిన కలెక్టర్



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించిన ఇందూరి రష్మితకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో 1000 మార్కులకు గాను 996 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానం పొందిన ఇందూరి రష్మిత గురించి డిస్ట్రిక్ ఎన్ఆర్ఐ ఫౌండేషన్ కార్యదర్శి బండి నాగేశ్వరరావు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్

మిగతా 2లో..

# మూడు గ్రూపులు.. ఆరు అపనమ్మకాలు..!

## -ఇదీ బిజేపి తీరు
## -కమలంలో వర్గపోరు




ప్రజాపక్షం/పాల్వంచ : కమలదళంలో గ్రూపుల గొడవ మొదలైనది. మూడు గ్రూపులు... ఆరు అపనమ్మకాల మాదిరిగా బిజేపి తీరు మారింది. జిల్లా అధ్యక్షులు ఒంటెద్దు పోకడలతో పార్టీకి తీరని నష్టం కలుగుతున్నదనే సమాచారం. పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పని చేసే సీనియర్ నాయకులను ఎంతమాత్రం పట్టించుకోడని పలువురు అంటున్నారు. జిల్లా అధ్యక్ష పదవులకు పోటీగా నిలిచిన వారిపై కక్ష్య సాధింపు చర్యగా వారిని కావాలనే దూరం పెడుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమ సొంత ఎంజెండాను అమలు చేస్తూ నియోజక వర్గ కన్వీనర్‌లకు చెక్ పెడుతూ... పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచుతున్నారనే అప్రతిష్టను మూట కట్టుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనితో ఆ పార్టీలో చేరాలనుకొనే వారు భయపడుతున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది.

**బిజేపికి ఆదరణ తక్కువ...**

పలు ఉద్యమాల చరిత్ర కలిగిన జిల్లాలో భారతీయ జనతా పార్టీకి ప్రజల ఆదరణ తక్కువనే చెప్పాలి. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో గతంలో కన్నా భిన్నంగా అధిక శాతం ప్రజలు ఓటు వేసి ఆదరించారు. దీనితో ఆ పార్టీకి

మిగతా 2లో..

## ప్రభుత్వ పనులను నాణ్యతతో పూర్తి చేయాలి


-గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తా
-అభివృద్ధి పనుల శంకుస్థాపనలో కూనంనేని



ప్రజాపక్షం/సుజాతనగర్: ప్రభుత్వ అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తిచేయాలని లేని పక్షంలో సహించేది లేదని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని నిమ్మలగూడెం గ్రామంలో సీసీ రహదారుల నిర్మాణం 60 లక్షలు సంపు, పంపుహౌస్ 31 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్మలగూడెం చాలా గొప్ప గ్రామమని గొప్ప గుణం ఉన్న వాళ్ళని 45 ఏళ్ల నుండి మాతో

మిగతా 2లో..

# నియోజకవర్గాల డీ లిమిటేషన్లపై ఆశలు..!





-పునర్ విభజనపై జోరుగా ప్రచారం
-జిల్లాలో మరో నియోజకవర్గం..?
-త్వరలోనే జన గణన

ప్రజాపక్షం/వైరా: కేంద్ర ప్రభుత్వం జెమిలి ఎన్నికలు పెట్టాలని చూస్తున్న నేపద్యంలో ఇటీవల జనగణనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పార్లమెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల పునర్ విభజనకు కసరత్తు చేపడుతుంది. దేశవ్యాప్తంగా కులగణన ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే మహిళా రిజర్వేషన్లపై సైతం కేంద్రం నిర్ణయం తీసుకున్న విషయం మనకు తెలిసిందే. కులగణనకు కేంద్రం ఆమోదం తెలిపిన నేపద్యంలో ఖమ్మం జిల్లాలో నియోజకవర్గాల డీలిమిటేషన్ జరిగే అవకాశం

మిగతా 2లో..

# ఆదర్శంగా జిల్లా వ్యవసాయ రంగ అభివృద్ధి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రాష్ట్రానికి ఆదర్శంగా ఖమ్మం జిల్లా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వ్యవసాయ, ఉద్యానవన శాఖల పనితీరుపై అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ సాగు, ఎరువులు, విత్తనాల లభ్యత, రైతుభరోసా, రైతు భీమా, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం వంటి పలు అంశాలపై మండలాల వారీగా కలెక్టర్ చర్చించి

మిగతా 2లో..

-ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చర్యలు
-ఆయిల్ పామ్ వంటి లాభసాటి సాగును ప్రోత్సహించాలి
-ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలి
-వ్యవసాయ, హార్టికల్చర్ శాఖల పనితీరుపై కలెక్టర్ సమీక్ష

# మూడు గ్రూపులు.. ఆరు అపనమ్మకాలు..!

ఓటింగ్ శాతం పెరగటంతో కమలం పట్టణం నుండి పల్లె వరకు విస్తరించినదని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. కాని జిల్లా నాయకత్వంలో నెల కొన్న పరిణామాలతో జిల్లాలో నాయకులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మారింది.

**సభ్యత్వాల నమోదులో మూడవ స్థానం, పట్టించుకోని రాష్ట్ర నాయకత్వం :**

బిజేపి పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పార్టీ సాధారణ సభ్యత్వాల నమోదులో రాష్ట్రంలో జిల్లా మూడవ స్థానంలో నిలిచింది. ఆ సమయంలో జిల్లా పార్టీ అధ్యక్షుగా ఉన్న కేవి. రంగాకిరణ్ పై అదే పార్టీకి చెందిన మరోవర్గం నాయకులు ఎస్సి, ఎస్టి కేసు నమోదు చేయించారనే ఆరోపణలు పెద్దఎత్తున వ్యక్తమయ్యాయి. దీనిపై రాష్ట్ర నాయకత్వం ఎంత మాత్రం పట్టించుకోక పోవటంలో వర్గ పోరుకు బాటలు పడ్డాయి. అనంతరం మాజీ, తాజా అధ్యక్షుల నడుమ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర నాయకత్వం, కార్యకర్తల సమక్షంలోనే పలు మార్లు వాదోపవాదాలు, బూతులు తిట్టుకొంటూ ... కొట్టుకొనే వరకు వెళ్ళిందని ఆ పార్టీ కార్యకర్తలు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర నాయకత్వం జిల్లా పార్టీని గాడిలో పెట్టక పోవటంతో క్రమశిక్షణ లోపించి జిల్లా బిజేపిలో వర్గ పోరుకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది.

**దూరం పెడుతున్న అధ్యక్షులు...**

జిల్లా పార్టీ అధ్యక్షులు తనకు పోటీగా నిలిచిన రంగా కిరణ్, సోమసుందర్, పొడియం బాలరాజు, భూక్యా సీతారాం నాయక్, యడ్లపల్లి శ్రీనివాస్ కుమార్, ముస్కు శ్రీనివాస్‌రెడ్డిలను, గతంలో పార్టీ పటిష్టత కోసం పని చేసిన నాయకులను, కార్యకర్తలను పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించకుండా, కావాలనే దూరం పెడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**సమస్యలను పట్టించుకోని వైనం...**

జిల్లా నాయకత్వం పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను ఎదో మొక్కుబడిగా నిర్వహించి చేతులు దులుపుకోవడం తప్పా, ఇతరత్రా ప్రజా సమస్యలపై పార్టీ గళాన్ని వినిపించటంలో ఘోరంగా విఫలం అవుతున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఒకవేళ మండల నాయకత్వం సమస్యలపై స్పందిస్తే వారి పట్ల జిల్లా నాయకత్వంతో తిప్పలు తప్పవంటున్నారు. దీంతో జిల్లాలో ఇప్పుడిప్పుడే బలం పుంజుకొంటున్న పార్టీకి నీలినీడలు అలుకున్నాయనే వాదన వినవస్తోంది.

**కార్యాలయం లేని పార్టీ...**

కార్యాలయం లేని పార్టీ ఏదైనా ఉందంటే జిల్లాలో జాతీయ పార్టీ బిజేపి అని టక్కున చెప్పేస్తారు. కనీసం కార్యాలయం ఏర్పాటు చేసేందుకు సైతం వెనకాడుతున్న అధ్యక్షుడి తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**మా పార్టీలో గ్రూపులు లేవు : జిల్లా అధ్యక్షులు బైరెడ్డి**



మా పార్టీలో ఎలాంటి గ్రూపులు లేవు, పార్టీ అంతా ఒక్కటే, ఒకరిద్దరు అసంతృప్తితో ఉండటం సహజమన్నారు. పార్టీ ఇచ్చిన ప్రతీ కార్యక్రమాన్ని అందరి సహకారంతో నిర్వహిస్తున్నాం. విజయవంతం చేస్తున్నాం. సకల హంగులతో కార్టీ కార్యాలయం త్వరలోనే ఏర్పాటు చేస్తామని బిజేపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

# ఆదర్శంగా జిల్లా వ్యవసాయ రంగ అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఆధునీక సాగు పద్దతులు పాటించడం, పంటల మార్పిడి విధానం అమలు వంటి కార్యక్రమాల్లో మన జిల్లా రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తయారు చేయాలని సూచించారు. ఎరువులు, విత్తనాల లభ్యత పట్ల ఎటువంటి ఫిర్యాదులు రాకుండా మండల వ్యవసాయ అధికారులు, ఏఈవోలు చర్యలు తీసుకోవాలన్నారు. విత్తనాల నాణ్యత చాలా కీలకమని ఎక్కడ కల్తీ విత్తనాలు విక్రయం జరగకూడదన్నారు. తొమ్మిది రోజుల వ్యవధిలోనే తొమ్మిదివేల కోట్ల రూపాయలను ప్రభుత్వం రైతు భరోసా క్రింద రైతుల ఖాతాల్లో జమ చేసి వ్యవసాయ రంగ ప్రాధాన్యతను తెలియజేసిందన్నారు. మండల వ్యవసాయ అధికారి తమ పరిధిలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. జిల్లాలో ఎరువులు, విత్తనాల స్టాక్ లభ్యత ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కావాలన్నారు. మనదేశం ప్రతి ఏడాది వేల కోట్ల విలువ చేసే ఆయిల్ పామ్ దిగుబడి చేసుకుంటుందన్నారు. ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ పంట ఎక్కువ మొత్తంలో విస్తరించాలన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ లక్ష్యం చేరుకోవాలని, ప్రతి క్లస్టర్‌కు ఒకే రకమైన లక్ష్యాలు కాకుండా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను నిర్దేశించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తనకు కేటాయించిన ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీలపై సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. వరి పంట వైపు మాత్రమే రైతులు మొగ్గు చూపకుండా లాభసాటి పంటలు సాగు జరిగేలా చూడాలన్నారు. ఆధునీక సాంకేతిక ద్వారా వ్యవసాయాన్ని సాగు చేయడం వల్ల రైతులకు కలిగే లాభాలను



వివరించాలన్నారు. ఎరువుల వినియోగం తగ్గించడం, నేచురల్ పామింగ్ పెంచడం, సాగు దిగుబడి పెంచడం వంటి అంశాలపై దృష్టిసారించి ఏఈవోలు తరచూ రైతులకు అవగాహన కల్పించాల న్నారు. పొలం మధ్యలో ఫిష్ పాండ్ అభివృద్ధి చేయడం వల్ల వచ్చే లాభాల గురించి రైతులకు వివరించాలన్నారు. ప్రతి ఇంచు భూమి పూర్తి స్థాయిలో వాడుతూ రైతుల ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నేచురల్ ఫార్మింగ్ జరిగే పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇతర రైతుల కూడా నేచురల్ ఫార్మింగ్ పట్ల అవగాహన కల్పించాలన్నారు. అవగాహన కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఇంచార్జి జిల్లా ఉద్యానవన అధికారి ముత్యాలు, కూసుమంచి, వైరా, ఖమ్మం అర్బన్, సత్తుపల్లి, మధిర ఏడిఏలు, మండల వ్యవసాయ శాఖాధికారులు, హార్టికల్చర్ అధికారిణి అనిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలల బలోపేతంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :**



ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని చెరుకు అభివృద్ధి మండలి (సీడీసీ) మాజీ చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని మంద్రాజుపల్లి లో లీలాప్రసాద్ మనవరాలి పుట్టిన రోజు సందర్భంగా ప్రాధమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల పిల్లలకు బ్యాగులు, కుర్చీలను వితరణ గా అందించారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో కార్పోరేట్ స్థాయి విద్య ను అందిస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నెల్లూరి అనురాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తొర్తి గురవయ్య, ఉపాధ్యాయులు, నాగుల్మీరా అంగన్వాడీ టీచర్ సుజాత నవ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ పట్టణ, మండల నూతన కార్యవర్గం




**ప్రజాపక్షం/ఇల్లెందు:** భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) నూతన కార్యవర్గ సభ్యులను మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ, మండల అధ్యక్ష, కార్యదర్శులుగా కారం పద్మ, తడికల శ్రీలక్ష్మి, అలుగు సరిత, కమటం చంద్రకళను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మండలంలో 18మంది, పట్టణంలో 21మంది సభ్యులు ఎన్నుకున్నారు.

# ప్రభుత్వ పనులను నాణ్యతతో పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఇంటింటికి త్రాగునీరు అందించడం రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. భూ సమస్యలు ఉంటే తహశీల్దార్ ద్వారా సమస్యలు పరిశీలించుకోవాలని సూచించారు, సుజాతనగర్ లోని ఏడు గ్రామపంచాయతీలు కార్పొరేషన్ ఏర్పాటు కావడం వలన భూమి ధరలు పెరుగుతాయని, స్థానిక ఉద్యోగులకు జీతాలు పెరుగుతాయని తెలిపారు. దీనివలన అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. అనంతరం గ్రామస్తులు కూనంనేని కి పుష్పగుచం అందించి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, తహశీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎం పి ఓ శ్రీనివాస్, డి ఈ శివయ్య, ఏవో నర్మదా, ఎలక్ట్రికల్ ఏఈ గుగులోత్ కిషన్, ప్రధానోపాధ్యాయులు మద్దెల శివకుమార్, సిపిఐ మండల కార్యదర్శి భూక్య దస్రు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కుమారి హనుమంతరావు, జక్కుల రాములు, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు కేశవరావు, మాజీ సర్పంచ్ బండి రమేష్, మాజీ ఎంపీటీసీ గణేష్, మేకల వెంకటేష్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రష్మితకు ల్యాప్‌టాప్ బహూకరించిన కలెక్టర్

(మొదటిపేజీ తరువాయి)

అభిషేక్ అగస్త్యల దృష్టికి తీసుకెళ్లారు. నగర పాలక సంస్థ కమిషనర్ సారథ్యంలో శనివారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ లు రష్మితను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె ఉన్నత విద్యాభ్యాసానికి ఉపయోగపడేలా రూ. 70వేల విలువ గల హెచ్‌పి ల్యాప్‌టాప్‌ను కలెక్టర్ చేతుల మీదుగా బహూకరించారు. తన ప్రతిభకు తగిన గుర్తింపుగా తమిళనాడు తంజావూరులోని శాస్త్ర యూనివర్సిటీలో బిటెక్ సిఎస్ఈ కోర్సులో సీటు సాధించింది. పేద కుటుంబం కారణంగా చదువును కొనసాగించడంలో తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయి. తండ్రి సత్యనారాయణ ముత్తగూడెం గ్రామంలో ఓ ప్రైవేటు స్కూల్‌లో చిరుద్యోగిఈ నేపథ్యంలో ఆమె కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్, ఎన్ఆర్ఐ ఫౌండేషన్‌లను సంప్రదించింది. పేదరికం కారణంగా ఒక ప్రతిభాశాలి తన బంగారు భవిష్యత్తును కోల్పోకూడదనే తాత్పర్యంతో ముగ్గురు అధికారులు రష్మితకు ఆర్థికంగా, మానసికంగా భరోసానిచ్చారు. ఈ సందర్భంగా వారు రష్మితకు విద్యే నీకు ప్రపంచానికి పరిచయం, కష్టపడి చదువుకుంటే విజయాలు నిన్ను అనుసరిస్తాయంటూ ప్రోత్సహించారు. దాతల సహకారంతో రష్మిత కళాశాల ఫీజు కట్టడానికి ఎన్ఆర్ఐ ఫౌండేషన్ సిద్దంగా ఉన్నట్లు కార్యదర్శి బండి నాగేశ్వరరావు తెలిపారు.

# నియోజకవర్గాల డీ లిమిటేషన్లపై ఆశలు..!

(మొదటిపేజీ తరువాయి)

ఉందని రాజకీయ వర్గాల్లో ప్రజల్లో జోరుగా చర్చ సాగుతుంది. జిల్లాను యూనిట్‌గా తీసుకొని నియోజకవర్గాలను ఏర్పాటు చేస్తారా, లేదా భౌగోళిక స్థితులను ఆధారంగా చేసుకొని విభజిస్తారా అనే అంశంపై చర్చ జరుగుతుంది. నియోజకవర్గాల పునర్ విభజన చేపడితే జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య 6కు పెరుగుతుందని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతుంది. ప్రస్తుతం జిల్లాలో ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. వైరా నియోజకవర్గ రెండు నియోజకవర్గాలుగా ఏర్పడుతుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇదే తరుణంలో పలువురు రాజకీయ నాయకుల్లో కొత్త కొత్త ఆశలు కూడా చిగురుస్తున్నాయి.

**జిల్లాలో ప్రస్తుతం ఐదు నియోజకవర్గాలు...**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత అప్పటి ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త జిల్లాలు, మండలాలను ఏర్పాటు చేసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాగా ఉన్నప్పుడు 2008లో అంటే సుమారు 17 ఏళ్ల క్రిందట నియోజకవర్గాల పునర్ విభజన జరిగింది. విభజన సమయంలో ఉమ్మడి జిల్లా పరిధిలో వైరా అశ్వారావుపేట నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. బూర్గంపాడు నియోజకవర్గంగా ఉన్న దాన్ని పినపాక నియోజకవర్గంగా మార్పు చేశారు. కేంద్ర ప్రభుత్వం కులగణనకు ప్రాధాన్యత ఇవ్వడంతో మరోసారి అసెంబ్లీ నియోజకవర్గాల డీలిటేషన్ జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో జోరుగాచర్చ జరుగుతున్న నేపద్యంలో ఇప్పుపు వైరా నియోజకవర్గంపై ప్రాధాన్యత సంతరించుకుంది. కులగణన చేపట్టడమే నియోజకవర్గాల విభజనకు కారణం అని కొందరు విశ్లేషకులు తెలుపుతున్నారు. దీంతో వైరా నియోజకవర్గం నుంచి కొత్త అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. దీనికి తోడు రాబోయే ఎన్నికల నాటికి చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలుకానున్న నేపద్యంలో రాజకీయాల్లో కొనసాగుతున్న మహిళ నాయకులతో పాటు కొందరు నాయకులు తమ కుటుంబ సభ్యులను రాజకీయాల్లో దింపేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు నాయకులు ఇప్పటి నుంచే నియోజకవర్గాల పునర్ విభజన మహిళ రిజర్వేషన్ల గురించి లెక్కలు వేసుకుంటున్నారు. ఏ మండలం ఎటు పోతుంది కొత్తగా ఏ నియోజకవర్గం ఏర్పడుతుందని వైరా, తల్లాడ, కొణిజర్లతో పాటు మరో మండలాన్ని కలిపి నియోజకవర్గంగా ఏన్కూరు, కారేపల్లి, కామేపల్లి మండలాలను గిరిజన నియోజకవర్గంగా జూలురుపాడు, కొత్తగూడెం నియోజకవర్గాల్లో కలుపుతారని ఊహగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. సమయంలో పలువురు రాజకీయ నాయకులు మధ్య జోరుగా చర్చ కొనసాగుతుంది. నియోజకవర్గాల పునర్ విభజన తర్వాత మహిళలకు ఏ నియోజకవర్గం రిజర్వేషన్ అవుతుందో అనే దానిపై కూడా మహిళల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

**పునరః విభజనపై ఆశలు పెట్టుకున్న నేతలు...**

నియోజకవర్గం జరిగితే రిజర్వేషన్లు మారితే సమీకరణాలు ఏ విధంగా ఉంటాయని దానిపై రాజకీయ నాయకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మహిళారిజర్వేషన్ వస్తే భార్యలను ఎన్నికల బరిలో దింపేందుకు సిద్ధమవుతున్నారు. ఏది ఏమైనప్పటికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందో లేదో వేచిచూడాల్సిందే.

## నిధులు మంజూరు చేయండి

### ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ముఖ్య సలహాదారులు వేము నరేందర్ రెడ్డిని, సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ శనివారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసం లో కలుసుకుని వినతిపత్రం అందజేశారు.

## అనర్హులకే ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో పారదర్శకత లోపించిందని, అర్హులకు కాకుండా అనర్హులకు కేటాయిస్తున్నారని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్ తెలిపారు. శనివారం కైకొండాయిగూడెం, ఎన్నెస్పి క్యాంపులో జరిగిన వన్‌టౌన్, టూటౌన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆవుల అశోక్ పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో పారదర్శకత లేదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చిందని ఇచ్చిన హామీని ఇందిరమ్మ కమిటీలు అపహాస్యం చేస్తున్నాయన్నారు. అనర్హులకు కేటాయించిన జాబితాను అధికారులకు విన్నవించినప్పటికీ వాటిపై సర్వే నిర్వహించి తొలగించిన దాఖలాలు లేవన్నారు. స్పెషల్ ఆఫీసర్లు సర్వే చేసి అర్హులను గుర్తించి తుది జాబితాను రూపొందించినప్పటికీ ఇందిరమ్మ కమిటీ బాధ్యులు అర్హులను తొలగించి అనర్హులకు అందిస్తున్నారన్నారు. రేషన్ కార్డుల కోసం ప్రజలు ఏళ్ల తరబడి తిరుగుతున్నారన్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు వేల సంఖ్యలో ఉన్నారన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, పింఛన్ల మంజూరుకు మాస్‌లైన్ తరుపున పోరాటాలు సాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు కె. శ్రీను, శోభ, లక్ష్మి నారాయణ, లెనిన్, ధరణి కృష్ణ, సత్తార్, వెంకన్న, జాస్మిన్, వనిత పాల్గొన్నారు.

## డయాలసిస్ సెంటర్లు మంజూరు చేయండి

### వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదరతో ఎమ్మెల్యే రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు, పెనుబల్లిలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖామాత్యులు దామోదర రాజనర్సింహను, సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ కోరారు. హైదరాబాద్ లోని సెక్రటేరియట్ లో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహను, ఎమ్మెల్యే రాగమయి శనివారం కలుసుకున్నారు.ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రి లో పలు అభివృద్ధి కార్యక్రమాలు, సత్తుపల్లి 100 పడకల నూతన ప్రభుత్వ ఆసుపత్రి, నూతనంగా నిర్మాణం జరుగుతున్న నర్సింగ్ కాలేజీ తదితర విషయాలు, వాటికి కావల్సిన వసతులు తదితరాలను మంత్రికి, ఎమ్మెల్యే వివరించారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలు విన్న మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

## యువ టివి యాంకర్ స్వేచ్ఛకు ప్రెస్ క్లబ్ నివాళి



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** టీ న్యూస్ ఛానల్‌లో యాంకర్‌గా పనిచేస్తున్న యువ జర్నలిస్టు స్వేచ్ఛ శుక్రవారం బలవన్మరణానికి పాల్పడ్డ విషయాన్ని వివిధ టివి ఛానల్స్ ద్వారా తెలుసుక్ను తిరుమలాయపాలెం ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు స్వేచ్ఛకు ఘనంగా నివాళులర్పించారు. ముందుగా స్వేచ్ఛ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తిరుమలాయపాలెం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పసలాది సత్యనారాయణ మాట్లాడుతూ టీ న్యూస్ ఛానల్‌లో యాంకర్‌గా పనిచేస్తున్న యువ జర్నలిస్ట్ స్వేచ్ఛ బలవన్మరణానికి పాల్పడడం ఎంతో దురదృష్టకరమని అన్నారు. ఇటీవల కాలంలో దేశ వ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని, సమాజ హితం కోసం పనిచేసే జర్నలిస్టులపై దాడులు చేయడం ఎంతో బాధాకరమన్నారు. జర్నలిస్టులు స్వేచ్ఛగా వార్తలను ప్రచురించలేకపోతున్నారని, పత్రికా స్వేచ్ఛను అణిచివేయాలని చూస్తే సమాజంలో అరాచకాలు ఎక్కువుతాయని ఆయన అన్నారు. యువ జర్నలిస్టు స్వేచ్ఛ మృతిపై సమగ్ర విచారణ జపిరి ఆమె మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యర్శి పప్పుల శ్రీనివాసరావు, కోశాధికారి ఉబ్బని సుందర్‌రావు, ఉపాధ్యక్షులు పోలేపొంగు నాగరాజు, కూరపాటి విజయ్, గౌరవ సలహాదారుడు మేకల నాగరాజు, సహాయ కార్యదర్శి యడవల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి గుజ్జ రామకృష్ణ, కమిటీ సభ్యులు పదముత్తం కనకరాజు పాల్గొన్నారు.

## జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

### సింగరేణి కాలనీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సింగరేణి కాలనీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐ.ఎన్.టి.యూ.సి అధ్యక్షులు త్యాగరాజన్, సిఐటియు అధ్యక్షులు రాజారెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షులు కాపు కృష్ణలు పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికుల సమావేశం జేవిఆర్‌ఓసిలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సముద్రాలు సుధాకర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, స్వతంత్రానికి ముందు నుండి ఇప్పటివరకు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, నాలుగు కోడ్ లుగా విభజించి, దేశంలో 50 కోట్ల మందికి పైగా ఉన్నటువంటి కార్మిక రంగం యొక్క మెడపై కత్తి పెట్టి, ఈ దేశంలో కార్మిక వర్గాన్ని విచ్ఛిన్నం చేసేందుకు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు ఈ సార్వత్రిక సమ్మె జరుగుతుందని తెలిపారు. దేశంలో 50 కోట్ల మంది కార్మికులు జులై 9 వ తేదీ జరిగే సమ్మెలో పాల్గొంటున్నారని, ఈ సమ్మె ద్వారా నరేంద్ర మోడీకి కనువిప్పు కలిగించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అదే విధంగా దేశ పరిరక్షణ కోసం, కార్మిక వర్గ రక్షణ కోసం, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం జరిగే ఈ సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొని దేశానికి ఒక సందేశాన్ని, కార్మిక వర్గానికి ఒక భరోసాను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా మోడీ కళ్ళు తెరిచి కార్మిక చట్టాల ఉల్లంఘనను ఆపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగం నరసింహారావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, ఉపాధ్యక్షులు ధారా భీమయ్య, భరణి, రామారావు, సూర్య, ప్రకాష్ ,నిమ్మటూరు రామకృష్ణ, యోబు, ఐ ఎన్ టి యు సి నాయకులు రజాక్, రామారావు, బట్టి విక్రమార్క, సిఐ టి యు, టీబీజీకేఎస్, ఏఐటి యు సి నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 30న 'పిండప్రధానం'ను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం /పాల్వంచ :** ములకలపల్లి మండలం పుసుగూడెం సీతారామ ప్రాజెక్ట్ 2 పంప్‌హౌజ్ దగ్గర బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించే నిర్వహించే కాంగ్రెస్ పార్టీకి పిండ ప్రధానం కు పార్టీ కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బిఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, కో ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు మంతపురి రాజుగౌడ్, కాంపల్లి కనకేష్‌లు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని కాంపల్లి క్యాంపు కార్యాలయంలో బిఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ... జిల్లా రైతాంగానికి సాగునీరందించాలని అశ్వాపురం సమీపంలోని అమ్మగారిపల్లి వద్ద 18 వేయిల కోట్లతో సీతారామ ప్రాజెక్టును నిర్మించిందన్నారు. దాదాపు 90 శాతం పనులు పూర్తి చేసిందని మిగతా పనులు చేసే క్రమంలో రాష్టంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయని అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కి దాదాపు రెండు సంవత్సరాల సమయం దగ్గర పడుతున్నా కానీ ప్రాజెక్టు పనులను పూర్తి చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. పనులు పూర్తి చేయించకుండానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మమత్రులు కలిసి ప్రాజెక్టును ప్రారంభించి నీటిని జిల్లా రైతులకు అందించకుండా ముగ్గురు మంత్రులు ప్రాతినిద్యం వహిస్తున్న నియోజక వర్గాలకు తరలించుకొని పోతున్నారని ఆరోపించారు. సాగు నీరు అందుతుందని ఆశించిన రైతులకు మొండిచేయి చూపిస్తున్నారని మండిపడ్డారు. నిలిచి పోయిన పది శాతం పనులు పూర్తి చేయాలన్నారు. నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు సాగర్ జలాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నీటి వసతి లేని జిల్లాకు ప్రభుత్వం స్పంధించి సీతారామ జలాలను జిల్లా రైతులకు అందించిన తరువాతనే ఇతర జిల్లాల రైతులకు ఇవ్వాలన్నారు. లేని యెడల ఈ నెల బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులను సమీకరించి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. పూసుగూడెం పంప్‌హౌజ్ దగ్గర ఈ నెల 30వ, తేదీన నిర్వహించే కాంగ్రెస్ పార్టీకి పిండ ప్రధానం కు రైతులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాలేరు సింధు తపస్వి, సంగ్లోత్ రంజిత్, కొత్తచెరువు హర్షవర్ధన్, కొట్టె రాఘవేంద్ర, ఆలకుంట శోభన్, గంగధారి పుల్లయ్య, తోట లోహిత్ సాయి, దరిమెళ్ళ మురళీక్రిష్ణ, గిద్దలూరి శివసాయి, కూరెల్లి మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కేటిపిఎస్‌లో ప్రమాదానికి యాజమాన్యమే బాధ్యత వహించాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** కేటిపిఎస్ కార్మాగారంలో ఈ నెల 27న జరిగిన ప్రమాదానికి యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని బిజేపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో శనివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ, కేటిపిఎస్ ప్రమాదంలో మృతి చెందిన సుబ్బారావు కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించి మృతుడి కుమారుడి విద్యార్హతకు తగ్గ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైడ్రోజన్ సిలిండర్ నిర్వాహణ నిపుణులైన వారి పర్యవేక్షణలో చేయాల్సిన పనులను ఆర్టిజన్ కార్మికులతో చేయించడం, అదే విధంగా కమర్షియల్ సిలిండర్లు వినియోగించాల్సిన స్థానంలో డొమెస్టిక్ సిలిండర్లను వాడటం వలన ప్రమాదం జరిగిందని ఆరోపించారు. తిరిగి ఇలాంటి ప్రమాదాలు భవిష్యత్‌లో జరగకుండా జెన్‌కో యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలచెరువు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు రాపాక రమేష్, గిరిజన మోర్చా కార్యదర్శి భూక్యా రవినాయక్, పట్టణ ప్రధాన కార్యదర్శులు కల్లోజు నాగరాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/కూసుమంచి :** కూసుమంచి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శనివారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో కార్యాలయ ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి పంపిణి చేశారు. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సిఫారసు మేరకు మంజూరైన 79 చెక్కులకు గాను 25 లక్షల 2500 రూపాయల చెక్కులను కూసుమంచి మంత్రి క్యాంపు కార్యాలయం పంపిణి చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ ఎర్రబోలు సూర్యనారాయణ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కొండపర్తి సురేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జొన్నలగడ్డ రవికుమార్ మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు మాదాసు ఉపేందర్ రావు, మాజీ సర్పంచ్ లు బజ్జూరి వెంకటరెడ్డి, చాట్ల పరుశురాం, పెండ్ర అంజయ్య, భీష్మాచారి, ముదిరెడ్డి కేశవరెడ్డి, ఇంటూరి పుల్లయ్య, బొంగా నాయక్, అంజయ్య, బెల్లంకొండ కిరణ్, చిలకబత్తిని రామారావు, బానోతు రవి నాయక్, మల్లికార్జున్ గౌడ్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సింగరేణి మండలంలో సర్టిఫికెట్ల జారీలో తీవ్రజాప్యం

**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది కొరతతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, భూ భారతి వెరిఫికేషన్, రేషన్ కార్డులు వంటి కీలక సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో స్థానిక గ్రామ పంచాయితీ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల కొరతతో ప్రజల పడిగాపులు...

మండలంలో కేవలం ఒకే ఒక్క రెవన్యూ అధికారి ఉండటం, ఆ అధికారి చెప్పిందే శాసనంగా మారడంతో ప్రజలు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. గత మూడు నెలలుగా మండల కార్యాలయంలో సర్టిఫికెట్ల దరఖాస్తులు భారీగా పేరుకుపోయాయి. ఒక అధికారి వల్ల పనులు సకాలంలో జరగడం లేదు. రోజూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాం అని ఓ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశాడు. బడాబాబులు, పైరవీలు లేకుండా దరఖాస్తులు ముందుకు కదలడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు..

### స్థానిక ఎన్నికలపై ఆందోళన...

ఈ జాప్యం స్థానిక సంస్థల ఎన్నికల పైనా ప్రభావం చూపుతోంది. హైకోర్టు మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించినప్పటికీ, ఇప్పటికీ స్పష్టత లేకపోవడంతో ప్రజల్లో ఆందోళనను పెంచుతోంది.



### తక్షణ చర్యలకు ప్రజల డిమాండ్...

ప్రజలు ఎదుర్కొంటున్న ఈ తీవ్ర సమస్యలను గమనించిన స్థానికులు, అధికారులు వెంటనే మరో రెవెన్యూ అధికారిని నియమించి, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మా సమస్యలను పట్టించుకోవాలని, అధికారుల కొరతను తీర్చి, పారదర్శకంగా సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఓ స్థానిక ప్రజానీకం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. సింగరేణి మండలంలో రెవెన్యూ సేవలను సమర్థవంతంగా అందించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ సమస్య పరిష్కారం కాకపోతే, ప్రజల అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉంది.

### స్టేట్ షూటింగ్ జూనియర్ ఛాంపియన్షిప్ పోట్లీలో

## ఘనత సాధించిన మాస్టర్ రియాన్ పటాన్






**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని గుంపెన గ్రామ పంచాయితీకి చెందిన మాస్టర్ రియాన్ పటాన్ 11వ తెలంగాణ స్టేట్ షూటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఘనత సాధించాడు. 2025 స్టేట్ లెవల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనేందుకు మూడు రోజులు ట్రైనింగ్ తీసుకుని మాస్టర్ రియాన్ పటాన్ ఈ నెల 21 నుండి ప్రారంభమైన జరిగిన 11వ తెలంగాణ స్టేట్ షూటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఇన్ స్మాల్ బోర్ అండ్ షార్ట్ గన్ ఈవెంట్స్‌ ఆస్పరిన్ షూటర్ స్థానాన్ని దక్కించుకున్నాడు. 50 మీటర్స్ రైఫల్ ప్రోన్ జూనియర్స్ విభాగంలో ఎంక్యూఎస్‌లో క్వాలిఫైయింగ్ స్కోర్ సాధించి కేరళలో జరగబోయే ప్రీ నేషనల్స్( సౌత్ జోన్), ఆలిండియా మాలాన్కర్లో స్థానం సంపాదించాడు. చాలా తక్కువ సమయంలో కష్టపడి సాధన చేసి జూనియర్స్ విభాగంలో ప్రీ నేషనల్, ఆల్ ఇండియా మౌలాన్కర్లో స్థానం సంపాదించాడు, చాలా తక్కువ సమయంలో కష్టపడి సాధన చేసి జూనియర్స్ విభాగంలో ప్రీ నేషనల్, ఆల్ ఇండియా మౌలాన్కర్ ఆడటానికి ఎంపిక అయినందుకు తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ సత్కరించారు. జూనియర్స్ విభాగంలో తనయుడు ప్రీ నేషనల్స్ ఆడటం ఎంతో సంతోషంగా ఉందని తండ్రి రహీం పటాన్ ఆనందం వ్యక్తం చేశారు. అన్ని వేళలా అందరికీ అందుబాటులో ఉంటూ తెలంగాణ షూటర్స్ అందరినీ ఆదరిస్తూ ప్రోత్సహిస్తూన్న తెలంగాణ రైఫల్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ జె కిరణ్, ఆంధ్రప్రదేశ్ రైఫల్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ రాజ్‌కుమార్, అసోసియేషన్ మెంబర్స్ శ్రావణ్, వంశీ, ఏ కిరణ్, సట్స్ కోచ్ సందీప్, హమీద్‌కి రహీం పటాన్ మాస్టర్ రీయిన్ పటాన్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామస్తులు బంధువులు రియాన్ పటాన్‌కు అభినందనలు తెలియజేశారు.

## 30న జరిగే కాంగ్రెస్ పార్టీకి పిండ ప్రధాన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/కరకగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు పిలుపు మేరకు ఈ నెల 30వ తేది సోమవారం జరగనున్న ములకలపల్లి మండలం, పూసుగూడెం గ్రామం దగ్గర గల సీతారామ ప్రాజెక్టు పంపు హౌస్ 2 వద్ద కాంగ్రెస్ పార్టీకి పిండ ప్రధాన కార్యక్రమాన్ని మండల బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కరకగూడెం బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రావుల సోమయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను సస్యశ్యామలం చేయాలని, రైతాంగాన్ని ఆదుకోవాలనే లక్ష్యంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అమ్మగారి పల్లి వద్ద సీతారామ ప్రాజెక్టును మొదలుపెట్టి 18 వేల కోట్ల రూపాయలతో సుమారు 90 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని, 10 శాతం పనులు మిగిలి ఉండగా 2023 లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో బిఆర్‌ఎస్ పార్టీ అధికారం కోల్పోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో గత 18 నెలలుగా ఈ యొక్క ప్రాజెక్టు పనులను పట్టించుకోవడం మానేసిందని కానీ గత సంవత్సరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు ములకలపల్లి మండలంలోని పూసుగూడెం వద్ద నిర్మించిన పంప్ హౌస్ 2 వద్దకు వచ్చి హంగు, ఆర్భాటాలతో సీతారామ ప్రాజెక్టును ప్రారంభించడం ఆ తర్వాత మిగిలిన 10 శాతం పనులను చేయించకపోవడం ఈ ప్రాంత రైతుల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఎంత ప్రేమ ఉన్నదో అర్థమవుతుందని, అంతేకాకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్మించిన ఈ ప్రాజెక్టు సాగునీటిని ఈ జిల్లా రైతులకు ఇవ్వకుండా ఖమ్మం జిల్లాలో ఉన్నటువంటి ముగ్గురు మంత్రులు వారు ప్రాతినిధ్యం వహిస్తున్నటువంటి నియోజకవర్గాలకు, వారి జిల్లాకు, నల్గొండ జిల్లాకు తరలించకపోవడం బాధాకరమని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎటువంటి సాగునీరు అందుబాటులో లేదని సీతారామ ప్రా జెక్టు నీరు వస్తేనే ఇక్కడి రైతులకు సాగునీరు అందుతుందని ఖమ్మం, నల్గొండ జిల్లాలకు సాగర్ జలాలు అందుబాటులో ఉన్నా గాని భద్రాద్రి జిల్లా నుండి సాగునీరు ఇక్కడ రైతులకు ఇవ్వకుండా తరలించుకుపోవడం బాధాకరమని తక్షణమే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాలని ఆ తరువాతే ఖమ్మం, నల్గొండ జిల్లాలకు తీసుకువెళ్లాలని లేని పక్షంలో బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో 30వ తేదీన కాంగ్రెస్ పార్టీకి పిండ ప్రధాన కార్యక్రమం అనంతరం జిల్లాలోని బిఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు, రైతులు ప్రతి రోజు తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, సోషల్ మీడియా వారియర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ సీట్లకు దరఖాస్తుల స్వీకరణ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని తెలంగాణ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల బాలికలు 2025,26 విద్యా సంవత్సరానికి 6,7,8వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ జీ హరిత అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ జూలై 7వ తేదీన ఉదయం 11గంటల నుండి 12గంటల వరకు పాఠశాల స్థాయి ప్రవేశ పరీక్ష బూర్గంపాడు గురుకుల పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని, దరఖాస్తులను స్వీకరించే చివరి తేదీ జూలై 1వ తేదీన అని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఘనంగా పివి నరసింహారావు జయంతి




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని సారపాకలో మాజీ ప్రధాని పివి నరసింహారావు 104వ జయంతి సందర్భంగా పినపాక నియోజకవర్గ బి బ్లాక్ అధ్యక్షులు బెల్లకొండ వాసుదేవరావు, మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు షేక్ ఖాజామియా, సిలివేరు శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాములపర్తి వెంకట నరసింహారావు భారతదేశానికి తొమ్మిదవ ప్రధానిగా 1991 నుండి 1996 వరకు కష్టకాలంలో వున్న దేశాన్ని సమర్ధంగా నడిపి, నూతన పారిశ్రామిక విధానం తీర్మానం, ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశాభివృద్ధిలో చెరగని ముద్ర వేసిన భారతరత్న, మన తెలంగాణ బిడ్డ, రచయిత, న్యాయవాది, బహుభాషా కోవిధుడన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ట్రైనీ కలెక్టర్



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ట్రైనీ కలెక్టర్ సౌరత్ శర్మ సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల నందు అటల్ టింకరింగ్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ పాఠశాల పరిసరాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ గురించి విద్యార్థులతో మాట్లాడారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ మంచిగా ఉపయోగించుకోవాలని, ఏమైనా సైన్స్ పరికరాలు కావాలంటే తెలపాలని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పాఠశాలలో ఆయన ఒక్క మొక్కను నాటారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి వాజిద్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ నాగరాజు శేఖర్, సీఎంవో సైదులు, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు మధుసూదన్‌రావు, లక్ష్మ ణరావు, సృజన, కైసర్ బేగం, కాంప్లెక్సీ సిఆర్పి సేవ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పేరుపల్లిలో పీర్ల వేడుక



**ప్రజాపక్షం/కారేపల్లి:** పేరుపల్లిలో పీర్ల వేడుకలను ఘనంగా నిర్వహించారు. గత 3 సంవత్సరాలుగా పేరుపల్లిలో దాతల సహకారంతో పీర్ల మహోత్సవాన్ని శుక్రవారం చేపట్టారు. మొహరం పండుగను పురస్కరించుకొని 11 రోజుల పాటు అంగరంగ వూభవంగా వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బద్రి యాదవ్, షేక్ షరీఫ్, మల్లెల నరేష్, దుంపటి సతీష్, దుంపటి సంపత్, పత్యం నవీన్, బోళ్ల మధు, నన్ను లక్ష్యాద్రి, ఎస్‌కె నజీర్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా వెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం నందు స్వామి వారికి శనివారం పురస్కరించుకుని ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లకు నిత్యాకళ్యాణంలో భాగంగా అంగరంగ వైభవంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి,ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, సూపరిండెంట్ విజయకుమారి, సేవా సమితి కార్యదర్శి నారాయణరెడ్డి, అధ్యక్షులు బొబ్బా కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షులు ఈశ్వరచంద్ర విద్యాసాగర్, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# జులై ఆరున సిపిఐ ఖమ్మం నగర మహాసభ



### -కరపత్రాల విడుదల

ప్రజాపక్షం/ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మం నగర ఐదవ మహాసభ జులై ఆరున ఖమ్మం సెయింట్ మేరీస్ హైస్కూల్ మస్తఫానగర్‌లో జరుగుతుందని సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా తెలిపారు. శనివారం ఈ మేరకు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జానిమియా మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ప్రజల కోసమే ఆవిర్భవించి ప్రజల కోసమే పని చేస్తుందన్నారు. పోరాటాల గుమ్మంగా పేరొందిన ఖమ్మం జిల్లాలో సిపిఐ నాయకులు అనన్య త్యాగాలు చేశారని వారి త్యాగాలతో ప్రజలకు అనేక హక్కులు సిద్ధించడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని ఆయన తెలిపారు. ఐదవ మహాసభలో ఖమ్మం నగరంలోని పేదలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లు, నివాస స్థలాలు, పట్టణ పేదలకు గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తదితర సమస్యలపై చర్చించి పోరాట కార్యక్రమం రూపొందించుకోవడం జరుగుతుందన్నారు.ఈ మహాసభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర నాయకులు మహ్మద్ మౌలానా, దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, నగర నాయకులు యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, వరదా నర్సింహారావు, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వాలి

**సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రా బాబు**

ప్రజాపక్షం/కొణిజర్ల : వృద్ధాప్య, వితంతు, వికలాంగులు పెన్షన్లకు అర్హులైన వారందరికి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించేందుకు పెన్షన్లు ఇవ్వాలని సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రా బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని గోపవరం సిపిఐ గ్రామ శాఖ శుక్రవారం రాత్రి మీడియాల వెంకటి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పెన్షన్‌కోసం ధరఖాస్తు చేసుకున్నవారందరు పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయం చుట్టు కాళ్లరిగేలా తిరుగుతున్నా పెన్షన్‌లు రావడంలేదని అన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు అవుతున్నా కొత్త పెన్షన్‌లు ఇంతవరకు ఇవ్వలేదని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులు వెంటనే పరిశీలించి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు ఉన్న భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు లేక తహశీల్దార్ కార్యాలయం చుట్టు సంవత్సరాలనుంచి తిరుగుతున్నారని అలాంటి రైతులకు సమగ్ర భూసర్వే జరిపి భూభారతి చట్టంద్వారా పట్టాహక్కులు కల్పించాలన్నారు. అనంతరం గోపవరం గ్రామశాఖ కార్యదర్శిగా మురికిపూడి ఆశీర్వాదం, సహాయ కార్యదర్శిగా మురికిపూడి యశోద తోపాటు 11 మందితో కమిటి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో మాజీ ఎంపిటిసి పిడియాల వజ్రమ్మ, సీనియర్ నాయకులు మిట్టపల్లి వెంకటేశ్వర్లు, జాంబవంతు, అబ్రహాం, కోటపర్తి వెంకటు, కంచర్ల పిచ్చమ్మ, ఏర్పుల నిర్మల తదితరులు పాల్గొన్నారు.




# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/పినపాక: నియోజకవర్గ అభివృద్ధి సంక్షేమమే తనకు ముఖ్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని దుగినేపల్లి, చేగర్శల, టీ కొత్తగూడెం, అమరారం, కిష్టాపురం, పాండురంగా పురం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేశారు. మండలంలోని చేగర్శల, దుగినేపల్లి, కిష్టాపురం, రెడ్డిగూడెం గ్రామాల్లో నూతనంగా రూ. 65 లక్షలు వెచ్చించి నిర్మించిన సిసి రోడ్లకు ప్రారంభోత్సవం చేశారు. టీ కొత్త గూడెం, అమరారం, రెడ్డిగూడెం, కిష్టాపురం, దుగినేపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన చేశారు. అక్కడి స్థానికులతో మాట్లాడుతూ సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. అనంతరం దుగినేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాయం మాట్లాడారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణం నాణ్యతగా, త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, రెండో విడతలో అర్హులందరికి ఇల్లు అందిస్తామన్నారు. పినపాక నియోజకవర్గాన్ని రోల్ మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. పినపాక అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమని, నేను చేసిన అభివృద్ధి గ్రామాల్లో కనబడుతుందని, సోషల్ మీడియాలో కనబడదని, సోషల్ మీడియా లో తరచూ పోస్టులు పెడితే ప్రజలు గెలిపించరని, 35 వేల మెజారిటీ ఇవ్వరని చురకలు అంటించారు. నియోజకవర్గం లో అభివృద్ధి కొందరు నాయకులకు గిట్టడం లేదని, అక్కసు తో ఆరోపణలు చేస్తూ రాజకీయం చేస్తున్న వారిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు నిబద్ధత తో పని చేసి, ప్రభుత్వం అందించే అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బి.తాతారావు, ఎంపీడీఓ సునీల్ కుమార్, ఎంపీవో వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ డి ఈ, ఏ ఈ, ఏ. ఓ వెంకటేశ్వరావు, విద్యుత్ ఏ ఈ వేణుగోపాల్, హౌసింగ్ ఏ ఈ వినీత, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, జాతీయ మిర్చి బోర్డ్ టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉడుముల లక్ష్మి రెడ్డి, పేరం వెంకటేశ్వరరావు, గంగిరెడ్డి వెంకటరెడ్డి, దాట్ల రాజేష్, జి.శ్రీనివాస్ రెడ్డి, బోడ ఈశ్వర్, తోలేం అర్జున్, బందారు సాంబశివరావు, సాగర్ రెడ్డి, పాడి హేమంత్, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.



# అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/ఇల్లెందు: అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలబాలికల ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చైతన్య సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే దుష్ఫలితాలు, అక్రమ రవాణా అరికట్టడంపై చిన్న వయస్సు నుంచి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థులు తెలిసిన వ్యక్తుల ద్వారా గాని, తెలియని వ్యక్తుల ద్వారా గానీ వారి తెలియకుండానే అక్రమ రవాణాకు బాధ్యులు అయ్యే అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తికార్తీక్, సీనియర్ న్యాయవాదులు కొండ నారాయణ, ఎస్.వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓ.ఉమాశంకర్, బోధన, బోధనేతర, కోర్టు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట



ప్రజాపక్షం/ఎర్రుపాలెం : మండల పరిధిలోని మామూనూరు సెక్షన్ పరిధిలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కెపాసిటర్ వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ వి.గణేష్, లైన్ ఇన్స్‌పెక్టర్ జార్జ్, లైన్‌మెన్ వెంకటరమణ, రైతులు లక్కిరెడ్డి విశ్వనాధరెడ్డి, వెన్నపూస వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## వైరా మున్సిపాలిటీలో కొనసాగుతున్న పారిశుధ్య పనులు



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పారిశుధ్య పర్యవేక్షణ పనులు ప్రతిరోజు వార్డుల వారీగా కొనసాగుతున్నాయి. శనివారం పారిశుధ్య పనులను మున్సిపాల్ కమీషనర్ చింతా వేణు పరిశీలించారు. మున్సిపాలిటీ 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఒకటో వార్డు బిసి కాలనీ, 14వ వార్డు ఎస్సీ కాలనీలో, వాటర్ ట్యాంకులను శుభ్రపరచడంతో పాటు డ్రైనేజీలో పూడిక తీసి దోమలు వృద్ధి చెందకుండా లార్వాను స్ప్రే చేశారు. అదేవిధంగా జెసిబిలు సాయంతో పెద్ద పెద్ద ముళ్లపొదలను తొలగించారు. ఈ సందర్భంగా కమీషనర్‌చింతా వేణు మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వందరోజుల పనిలో భాగంగా పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయని, వార్డులు శుభ్రం చేయడం జరుగుతుందని కూడా వార్డులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మల్లు నందినికి సన్మానం



ప్రజాపక్షం/వైరా: వైరా మండలం గొల్లపూడి గ్రామంలో పసుపులేటి మోహన్‌రావు వినోద దంపతులు శనివారం మల్లు నందినిని శాలువా కప్పిసన్మానించారు. ఈ సందర్భంగా వారి ఇంట్లో జరిగిన తేనేటి విందులో మల్లు నందిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో రాజకీయ పరిస్థితుల గురించి ఆమె వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో రొంటే హనుమంత్, సురేష్, పసుపులేటి నాగేశ్వరరావు, పత్తిపాటి వెంకటయ్య, ఏ.శేషమ్మ, షేక్ రంజాన్‌బీ, బొద్దు ఉపేంద్ర, చింతల బాలాజి, వరికూటి జాన్‌కోటి, వీసం శివయ్య, అమరనేని వెంకటయ్య, షేక్ నాగూర్, పసుపులేటి వెంకటరామయ్య, బొమ్మిని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగు లాభదాయకం



ప్రజాపక్షం/పెనుబల్లి: పెనుబల్లి మండలం, మండాలపాడు గ్రామంలోని సోమరాజు నరసింహారావు, వెంకట శ్యాంప్రకాశ్ , రామకిషన్ రైతుల భూమిలో చేపట్టిన ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ ప్రోగ్రామ్ లో ఉద్యాన అధికారి నగేష్, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ నాగలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ఆయిల్ పామ్ పంట లాభదాయకమని ఒకసారి నాటితే 30 సంవత్సరం ల వరకు ఆదాయాన్ని ఇచ్చే పంట అని, కోతుల నుండి ప్రకృతి వైపరీత్యాల నుండి హాని లేని పంట అని,చీడ పీడలు తక్కువగా ఆశించే పంట అని, మార్కెటింగ్ సౌకర్యం ఉన్న పంట అని తెలిపారు. ప్రభుత్వం 200 రూపాయల విలువ గల మొక్కని రాయితీ మీద 20 రూపాయల కి ఇవ్వడం తో పాటు 4 సంవత్సరం ల పాటు నిర్వహణ ఖర్చుల కింద ప్రతి సంవత్సరం ఎకరాకు 4500 చొప్పున ఇస్తుంది అన్నారు. ఆయిల్ పామ్ పంటకు ఎస్సీ, ఎస్టీ లకు 100 శాతం, బిసి లకు, చిన్న సన్న కారు రైతులకు 90 శాతం,ఇతరులకు 80 శాతం రాయితీ పై డ్రిప్ పరికరాలు ఇవ్వడం జరుగుతుంది.

## మధ్యాహ్నం భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందే



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం లో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందేనని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య తో పాటు పలు అంశాల పై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో గడ్డి లేకుండా శుభ్రం చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తొర్తి గురవయ్య, ఉపాధ్యాయులు నాగుల్మీరా, పంచాయతీ కార్యదర్శి రామారావు, అంగన్వాడీ టీచర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలకు విశ్వాసం కల్పించాలి



**సత్తుపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలలో విశ్వాసం కల్పించాలని, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య శాఖ సేవా దృక్ప థంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం పేదల వైద్యా నికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సత్తుపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి అంతా కలియతిరిగి, స్కానింగ్ గది, జనరల్ ఓపి, డ్రెస్సింగ్ రూం, ఇంజక్షన్ రూం, ఎక్స్ రే రూం, డెంటల్ విభాగం, ఫార్మసీ, డయాలసిస్ వార్డులను పరిశీలించారు. ఏఎన్సి రిజిస్ట్రేషన్, ఎన్సిడి సర్వే గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసు పత్రిలో అందిస్తున్న సేవలు గురించి అడిగి, సాధారణ ప్రసవాలు ప్రో త్సహించాలని కలెక్టర్ సూచించారు. పిల్లల వైద్యులు ఉన్నారా, ఏ, ఏ విభాగాల వైద్యుల అవసరం ఉన్నది అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్, ఎక్స్ రే విభాగంలో టెక్నీషియన్ లు ఉన్నది, ఇంకా ఏమేం అవసరాలు ఉన్నది ఆడిగారు. నాల్గవ తరగతి సిబ్బంది సరిపోను ఉన్నట్లు, క్రొత్త భవనానికి తగ్గట్లు పారిశుద్యానికి మరింత సిబ్బంది నియమించుకోవ చ్చన్నారు. పారా మెడికల్ సిబ్బంది వివరాలు అడిగారు. అందుబాటు లో ఉన్న మందులు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశా రు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉం టూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని, మందుల నిల్వలు సరిపడా ఉండే విధంగా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉండాలని తెలుపుతూ, ఆసుపత్రిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జనరల్ ఓపి ఆన్ లైన్ లో జరుగుతుందా, మాన్యువల్ గా జరుగుతుందా అని అడగగా, రెండు విధాలుగా జరుగుతున్నట్లు వైద్యాధికారులు సమాధానం ఇచ్చారు. ఆన్ లైన్ ఓపి నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. డయాలసిస్ విభాగం ద్వారా ప్రతి రోజు 20 మందికి డయాలసిస్ చేప డుతున్నట్లు, ఏరియా ఆసుపత్రి పరిధిలో 41 మంది రోగులు డయాల సిస్ కొరకు నమోదైనట్లు, వీరే రిపీటెడ్ గా వస్తున్నట్లు తెలిపారు. వ్యాధి వచ్చాక కాక, రాకుండా నియంత్రణ చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఆహారం, జీవన శైలి పై చైతన్యం తేవాలని కలెక్టర్ అన్నారు. పెయిన్ కిల్లర్ల వాడకం తగ్గించాలని, మెడికల్ షాపులు పెయిన్ కిల్లర్ల అమ్మకంపై నియంత్రణ చేయాలని అన్నారు.ఏరియా ఆసుపత్రికి కావాల్సిన పరికరాలు అందజేస్తామని, కాంట్రాక్టు రెన్యూ వల్ కు చర్యలు చేపడతామని, ఆసుపత్రిలో జనరల్ సర్జన్ నియామకా నికి, అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడానికి కృషి చేస్తా మని కలెక్టర్ అన్నారు. మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవా లని, వైద్యాధికారులు, సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు.అంతకుముందు కలెక్టర్, రూ. 34 కోట్లతో నిర్మిస్తున్న ఆసు పత్రి నూతన భవనాన్ని క్షుణంగా పరిశీలించారు. కొత్త భవనంతో ప్రజ లకు మరిన్ని వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, చిన్న చిన్న పనులు ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. రూ. 25 కోట్లతో నిర్మా ణంలో ఉన్న నర్సింగ్ కళాశాల నూతన భవన పనులను కలెక్టర్ పరిశీ లించారు. పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని అధికా రులను ఆదేశించారు.కలెక్టర్ తనిఖీల సందర్భంగా డిసిహెచ్ఓ డా. రాజశేఖర్, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు, అధికారులు తదితరులు ఉన్నారు.

# కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రప్రభుత్వం

**- విలేకరుల సమావేశంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కేంద్రలో పాలన సాగిస్తున్న బిజేపి ప్రభుత్వ కార్మిక హక్కులను కాలరాస్తోందని, 44 కార్మిక చట్టాలను అప హాస్యం చేస్తూ తీసుకొచ్చి నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాల కార్మిక సంఘాల జేఏసి నాయకులు ఏఐటియూసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్‌టియూసి నాయకులు త్యాగరాజన్, సిఐటియూ ఎస్ఇసియూ నాయకులు రాజిరెడ్డి, టిబిజికేఎస్ జనరల్ సెక్రెటరీ కాపు కృష్ణ అన్నారు.జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడి నాయకత్వంలోని బిజేపి ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. తద్వారా కార్మిక సంఘాలు పెట్టుకుని, సమ్మెచేసి హక్కు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా మోడి పాలన సాగుతూ కార్మికు లను అణిచివేసే దిశగా ముందుకు పోతోందన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 9న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఐఖ్యవేదిక ఆధ్వర్యలో తలపెట్టిన ఒక్కరోజు సమ్మెను అంతా జయ ప్రథం చేయాలని అన్నారు. తమ జీతాల కోసం కాకుండా కార్మిక వర్గ శ్రేయస్సు కోసం చేపడుతున్న సమ్మెను అవసరాన్ని బట్టి దీర్ఘకాళికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తామన్నారు. దేశంలోని సంఘ టిత, అసంఘటిత వర్గానికి చెందిన సుమారు 50 కోట్ల మంది కార్మి కులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారన్నారు. భారతదేశం ఆవిర్భవించి నాటి నుండి నేటి వరకు 25 సమ్మెలు జరిగితే బిజేపి అధికారం చేపట్టిన నాటి నుండి 12 దేశవ్యాప్త సమ్మెలు జరిగాయన్నారు. ఇప్పటికైనా నరేం ద్రమోడి ప్రభుత్వం కార్మికులపై కక్షకట్టడాన్ని ఆపాలని, కార్మికుల శ్రమశక్తిలేనిదే దేశంలో ముందుకు సాగదని గుర్తుంచుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐటియూసి నాయ కులు వంగా వెంకట్, రమణమూర్తి, ఐఎన్‌టియూసి, ఐటియూ,టిబిజి కేఎస్, సింగరేణి అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నూతన డైరెక్టర్ పా గౌతమ్‌కు గుర్తింపు సంఘం వినతి



**ప్రజాపక్షం/ఇల్లెందు:** సింగరేణి నూతన డైరెక్టర్ పా పోట్రు గౌతమ్ ఇల్లెందు ఏరియాకు వచ్చిన నేపథ్యంలో గుర్తింపు సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి, ఔషధమొక్కను అందించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి, శాఖా కార్యదర్శులు కె.సారయ్య, మహమ్మద్ నజీర్అహ్మద్ మాట్లాడారు. 135సంవత్సరాల చరిత్ర కలిగి బొగ్గు పుట్టినిల్లైన ఇల్లెందు ఏరరియా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, నూతనగనులు లేక మూతబడే పరిస్థితి నెలకొందని ఈ విషయమై అభివృద్ధికై సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ తమదృష్టికి తీసుకొస్తున్నామని తెలిపారు. జేకేఓసీ విస్తరణ పనులు త్వరితగతిన పూర్తిచేసి త్వరలో ప్రారంభం అయ్యేలా చొరవతీసుకుని బొగ్గు ఉత్పత్తి పనులు సింగరేణి కార్మికులు నిర్వహించే విధంగా చూడాలని కోరారు. సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు ఎంతో కృషి చేస్తోందని, ఇల్లెందు ఏరియాలో ఎకో న్యాచురల్ పార్కును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాఖ ఉపాధ్యక్షుడు దాసరి రాజారాం, క్లర్క్ స్టాఫ్ ఇంఛార్జి షేక్ ముస్తాఫా, ఫిట్ కార్యదర్శులు నూనె శ్రీనివాస్, ఎన్.లచ్చిరాం, దాట్ల వెంకటేశ్వర్లు, జయరాజ్, చాంద్‌పాషా, బానోత్ బాలాజీ, బొల్లెద్దుల శ్రీనివాస్, వీరన్న, ఎస్.రవి, తిరుమల్ రావు, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యులు పరిమితికి మించి వైద్యం చేయరాదు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** గ్రామీణ వైద్యులు పరిమి తికి మించి వైద్యం చేయరాదని స్థానిక వైద్యశాల డీడీఓ సంఘ మిత్ర అన్నారు. శనివారం ఆళ్లపల్లి పిహెచ్‌సిలో ఆర్ఎంపీలతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ క్లినిక్ వద్దకు వచ్చిన జ్వరాల రిపోర్టులు ఎప్పటికప్పుడు ఇవ్వాలన్నారు. రోగుల ఆరోగ్యం విషమించే వరకు వైద్యం చేయరాదన్నారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఈ రమాదేవి, ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

# వాగులో రాళ్లను తొలగించిన పోలీసులు



**ప్రజాపక్షం/గుండాల :** మండల పరిధిలోని కొండవ టంచ సమీపంలో గల కిన్నెరసాని వాగులో ఉన్న రాళ్లను శనివారం పోలీసులు శ్రమదానం చేసి తొలగిం చారు. వర్షాకాల ంవస్తే ఈ వాగులో వరద ఉధృతి అధి కంగా పెరిగి లో లెవల్ బ్రిడ్జీపై నుండి పెద్ద ఎత్తున వరద నీరు పొంగి పొర్లుతుంటుంది. దీంతో వాగులో రాళ్లను ప్రజల విజ్ఞప్తి మేరకు సిఐ రవీందర్ ఆదేశాలతో తొల గించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతీ ఏటా కిన్నెరసాని బ్రిడ్జీ లో లెవల్ వంతెనపై నుండి పెద్ద ఎత్తున నీరు పొంగిపొర్లుతుంటుందని, దీంతో ఆయా గ్రామల ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారన్నారు. పలుమార్లు ఈ విషయాన్ని గ్రామస్తులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. జేసిబి, ట్రాక్టర్ల సహాయంతో రాళ్లను తొలగించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రహమాన్, సిబ్బంది మల్లయ్య పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండల పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజు లు వసూళ్లను నియంత్రించాలని, అదే విధంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి పవన్ సాయి అన్నారు. శని వారం అశ్వాపురం ఎంఈవోకి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలు, బుక్ స్టాల్స్ యాజమాన్యాలై చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పినపాక నియోజకవర్గం కార్యదర్శి అక్కినపల్లి నాగేంద్రబాబు, మండల నాయకులు ఇసంపల్లి ప్రసాద్, గణేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండల కేంద్రంలోని పోలీ స్ స్టేషన్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం తనిఖీ చేశారు. ఈసంద ర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటా రు. అనంతరం రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారక్, టెక్నికల్ రూం, పోలీస్ సిబ్బంది క్వార్ట ర్స్‌ను, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబం ధించిన సూచనలు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎళ్లవేళలా ఫిర్యాదులు స్వీకరిం చడం, బాధితుల ఫిర్యాదుపై సత్వరం స్పందించి సేవలు అందించాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఆయన వెంట మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, అశ్వాపురం సిఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్



**ప్రజాపక్షం/మణుగూరు:** ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఆదేశాల మేరకు శనివారం మణుగూరు మండలంలోని రేగుల గండి, గొత్తికోయ గుంపు లో పోలీస్‌లు కార్డెన్ సెర్చ్ ప్రోగ్రాం నిర్వహించా రు. ఈ సందర్భంగా మణుగూరు సిఐ పి. నాగ బాబు మాట్లాడుతూ అక్కడున్నటువంటి ప్రజలు ఎవ్వరు కూడ సంఘ విద్రోహశక్తులకు, నక్సలై ట్లకు ఎటువంటి నిత్యవసర వస్తువులు కానీ ఎటువంటి సహాయాలు కానీ చేయవద్దు అని, వారి వలన భయభ్రాంతులకు గురి కావద్దని ఎటువంటి సమాచారం ఉన్నా గాని పోలీసు వారికి తెలి యపరచాలని, మణుగూరు పోలీస్ వారు ఎప్పుడు మీకు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ పి. నాగబాబు, మణుగూరు పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# 30న ఛలో పూసుగూడెంను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** జూన్ 30న ఛలో పూసుగూడెం కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మోరంపూడి అప్పారావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు, అశ్వారావు పేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్ చార్జ్, మాజీ ఎంఎల్ఏ మెచ్చా నాగేశ్వరరావు పిలుపు మేరకు సీతారామ ప్రాజెక్ట్ ద్వారా సాగు నీరు భద్రాద్రి జిల్లాలకు అందించాలని, జిల్లాలకు అందించకుండా ఎగుర ప్రాంతానికి తరలిం చుకొని పోతున్నారని మండిపడ్డారు. . ఈకార్యక్రమంలో నాయకులు శనగపాటి సీతారాములు, పుష్పాల చందర్‌రావు, సున్నం బాబురావు, ఐతం రాజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన నిర్మించుకోవాలి



## పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/పెనుబల్లి:** గ్రౌండింగ్ అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. పెనుబల్లి మండలం రామచంద్రరావు బంజర గ్రామాల్లో పర్యటించి, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతి ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. లబ్దిదారులతో సమస్యలు ఉన్నాయా, ఇసుక ఉచితంగా ఇస్తున్నారా, అధికారుల సహకారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మంజూరు ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ వంద శాతం చేయాలన్నారు. ముగ్గు వేయించి, రికార్డు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సత్తుపల్లి మండలానికి 576 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 467 ఇండ్లు నిర్మాణాలు ప్రారంభం అవగా, పెనుబల్లి మండలంలో 612 మంజూరయిన ఇండ్లలో 541 ఇండ్లు నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మండలానికి ఎంత మేర ఇసుక, మట్టి అవసరమో, ముందుగానే డంప్ చేసుకోవాలని, ఎఇ ద్వారా సంబంధిత తహశీల్దార్ కూపన్లు జారీచేస్తారని, అట్టి కూపన్లతో లబ్ధిదారులు పొందవచ్చని అన్నారు. ప్రతి సోమవారం నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులకు డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతాయన్నారు. కొత్తూరు గ్రామంలోని రేకుల కాలనీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తిచేసుకొని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకొని గృహ ప్రవేశానికి పిలవాలని లబ్దిదారులతో అన్నారు. అనంతరం పెనుబల్లి ఎంపీడీఓ కార్యాలయం లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వన మహోత్సవ కార్యక్రమం లో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు.కలెక్టర్ క్షేత్ర పరిశీలన సందర్భంగా కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, ఎంపిడివో లు నాగేశ్వరరావు, అన్నపూర్ణ, తహశీల్దార్లు సత్యనారాయణ, నారాయణ మూర్తి, హౌజింగ్ ఏఇ లు పవన్ కళ్యాణ్, కమల్, అధికారులు తదితరులు ఉన్నారు.

# అందుబాటులో విత్తనాలు, ఎరువులు



## ఈ-పాస్ మిషన్ ద్వారానే ఎరువుల అమ్మకాలు
## -తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రైతులకు వ్యవసాయానికి కావాల్సినన్ని విత్తనాలు, ఎరువులు జిల్లాలో అందుబాటులో ఉన్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టర్ సత్తుపల్లి లోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో విత్తనాలు, ఎరువులు, మందుల లభ్యతను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఏ ఏ విత్తనాలు ఎక్కువగా అమ్ముడవుతున్నది, రైతులు అడిగే రకాలు అందుబాటులో ఉంచుతుంది అడిగి తెలుసుకున్నారు. ఎరువులు ఈపాస్ మిషన్ ద్వారానే అమ్మకాలు జరగాలని, మాన్యువల్ గా అంగీకరించేది లేదని కలెక్టర్ అన్నారు. ఈపాస్ మిషన్ పనితీరును పరిశీలించారు. విక్రయాల రిజిస్టర్లు నిర్వహించాలన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తుండడంతో, రైతులు వరిపై మొగ్గు చూపుతున్నారని, అధిక లాభాలున్న హార్టికల్చర్ పట్ల రైతులను ప్రోత్సహించాలన్నారు. పామాయిల్ పంట చాలా లాభదాయకమని, అంతర పంటలుగా ఇతర పంటలను సాగు చేయవచ్చని అన్నారు. డ్రోన్ తో ఎరువుల, క్రిమీ సంహారకాల పిచికారీ తో ఖర్చు, సమయం ఆదా అవుతుందని అన్నారు. వ్యవసాయ అధికారులు, వారి వారి లక్ష్యం మేరకు విత్తన, ఎరువుల విక్రయ కేంద్రాల తనిఖీలు చేపట్టాలన్నారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, తహశీల్దార్ పున్నం సత్యనారాయణ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వి. శ్రీనివాస రెడ్డి, సత్తుపల్లి మండల వ్యవసాయ అధికారి వై. శ్రీనివాసరావు, అధికారులు తదితరులు ఉన్నారు.

# మహిళాసాధికారితే లక్ష్యంగా ముందుకు..




**ప్రజాపక్షం/ఇల్లెందు:** మహిళాసాధికారిత లక్ష్యంగా భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ) ముందుకు సాగుతోందని జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సారయ్య పేర్కొన్నారు. పట్టణంలోని విఠల్‌రావు భవన్‌లో ఏర్పాటైన పట్టణ 3వ మహిళ మహాసభలో మాట్లాడారు. పోరాటాల ద్వారానే మహిళ హక్కుల రక్షణ కలుగుతుందని తెలిపారు. అలనాడు కేవలం వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్నిరంగాల్లో పురుషులకు ధీటుగా ప్రపంచానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళల రక్షణలో ముందంజలో ఉన్నామని చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణలో మాత్రం మహిళల పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. క్రీడాకారుల పట్ల భాజపా మంత్రులు వ్యవహరిస్తున్న తీరు సామాజికంగా, మానసికంగా రెండోతరగతి శ్రేణి మహిళలను గుర్తిస్తూ బలహీనురాలుగా చేస్తున్నటువంటి ఘనత భాజపాకే దక్కుతుందని ఆరోపించారు. సమాజంలో అశ్లీలతలపై విస్తృతమైననటువంటి నీలిచిత్రాలు విడుదల చేస్తూ విదేశీ సంస్కృతిని మన దేశంలో కూడా విస్తృత ప్రచారం చేస్తున్న తీరుపట్ల నేటి యువత అటువంటి అశ్లీలతకు బానిసలుగా మారి మహిళలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతున్నారని, తక్షణమే కఠినమైన చట్టాలను అమలుచేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వీటిపై మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్, సంఘం జిల్లా అధ్యక్షురాలు కమటం చంద్రకళ, నిర్వాహక అధ్యక్షురాలు కె.రత్నకుమారి, సహాయకార్యదర్శి ధనలక్ష్మి, కారం పద్మ, తడికల శ్రీలక్ష్మి , అలుగు సరిత,, బంధం లక్ష్మి , నాగలక్ష్మి , వడ్ల అరుణ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం కలెక్టర్ అనుదీప్‌ను శనివారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వెంట మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, వడ్డే నారాయణరావు, సూరంపల్లి రామారావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, దొడ్డా పుల్లయ్య, మట్టూరి వెంకటేశ్వరరావు, బోళ్ళ గంగారావు, కోసూరి శ్రీను, పమ్మి అశోక్, షేక్ సైదా, తోటకూర గోపి, మురళి, బాలు తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వాలు

## -వసతి గృహాల వైపు కన్నెత్తి చూడని అధికారులు
## -ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వసతి గృహ విద్యార్థుల సంక్షేమాన్ని ప్రభు త్వాలు మరిచాయని ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. శనివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటికాల రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సి, ఎస్టి, బిసి సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. చదువుకోవడానికి సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వసతి గృహాల విద్యార్థుల సమస్యల పట్ల అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, నోటు పుస్తకాలు, బెడ్‌షీట్స్, ప్లేట్లు, గ్లాసులు, ట్రంకుపెట్టెలు ఇప్పటి వరకు అందించలేదన్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాల స్థానంలో కొత్త భవనాలను నిర్మించాలన్నారు. హాస్టల్ వార్డెన్స్ స్థానికంగా లేకపోవడంతో విద్యార్థుల సమస్యలు పట్టించుకునే నాథుడే లేడన్నారు. వసతి గృహాల వైపు సంబంధిత అధికారులు కన్నెత్తి చూడడం లేదన్నారు. వెంటనే వసతి గృహా విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు శివ, వంశీ, నాయకులు గోపి, రాహుల్, ప్రభాస్, నవీన్, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడిని నియంత్రించాలి

## ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** పలు ప్రైవేటు పాఠశాలల అధిక ఫీజులు వసూళ్లను నియంత్రించాలని అదే విధంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, అధిక ధరలకు పాఠ్య పుస్తకాలను అమ్ముతున్న వారిపై చర్యలు చేపట్టాలని, ఫహీమ్ డిమాండ్ చేసారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదామాట్లాడుతూ. ప్రతి తల్లిదండ్రులకు తమ పిల్లలకు మంచి విద్య అందించాలని ఆలోచన ఉంటుందని దీన్నే అదునుగా చేసుకొని వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ ఒక నియంతలా వ్యవహరిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఏటా విద్యార్థి సంఘాలు ఈ సమస్యలు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వస్తున్నప్పటికీ వారి నిర్లక్ష్యం మూలాన హద్దు అదుపు లేకుండా ప్రైవేట్ పాఠశాలలు ఈరోజు నియంతల వ్యవహరిస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయం పై ఆలోచన చేసి, ప్రతి ఏటా ఇష్టారాజ్యంగా పెంచుతున్న ప్రైవేటు పాఠశాలల ఫీజులపై నియంత్రణ చట్టం తీసుకురావాలని, ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25 ఉచిత విద్యను పేద విద్యార్థులకు అందించాలని అదే విధంగా బుక్ స్టాల్స్ లో సైతం 25 రూపాయలు ఖరీదు చేసే పాఠ్యపుస్తకాన్ని వందల్లో అమ్ముతున్నారని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలు బుక్ స్టాల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో అన్ని విద్యార్థి సంఘాలను ఏకం చేసుకుని ఉద్యమాన్ని తీవ్ర తరం చేయడం తప్పదని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు అజీత్, వంశీ, రానదీర్, వినయ్, సృజన్ తదితరుల పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు ఎంపిక



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లను ఎంపిక చేయడం జరుగుతుందని కాంగ్రెస్ నాయకుడు మచ్చా బుజ్జి తెలిపారు. సిరిపురం గ్రామంలో ఎల్ వన్, ఎల్ టు, ఎల్‌త్రీగా ఎంపిక చేయడం జరుగుతుందని అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి నిజమైన లబ్ధిదారులు ఎవరో గుర్తించి వారిని ఎంపిక చేస్తున్నారని, ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యం జరగడం లేదని, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో అధికారులు చర్చించి వీళ్ళు అర్హులా కాదా అని అడుగుతున్నారే తప్ప అనర్హులకు ఎక్కడ ఇళ్లు ఇవ్వడం లేదని ఆయనఅన్నారు. సిరిపురం గ్రామంలో రేషన్ కార్డు, ఆధార్‌కార్డు ఎప్పటి నుంచో నివాసం నిరుపేదలని ఎంపికచేయడం జరిగింది తప్ప అనర్హులను ఎంపిక చేయలేదని ప్రభుత్వం దీనిపై ఒక స్పష్టతతో ఉందని ఎవరు అపోహ పోవాల్సిన అవసరం లేదని నిజమైన అర్హులకు ప్రతిఒక్కరికి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని ఎవరో ఏదో చెప్పిన మాటలు వాస్తవం కాదని ఆయన అన్నారు. సిరిపురం గ్రామంలో అధికారులు పదేపదే ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారుల ఎంపికలో స్పష్టత పరిశీలించిన తర్వాత అర్హుడు అని నిర్ధారించిన తర్వాతనే ఇళ్లు మంజూరు చేస్తున్నారే తప్ప అర్హత లేని వారికి ఇళ్లు ఇవ్వడం లేదని అన్నారు.